



ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

ప్రయివేట్ దోపిడీ...

- ఇష్టారాజ్యంగా బస్సు ఛార్జీలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి సెలవులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాక తప్పడం లేదు...



పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ సెలవులు ముగియడంతో కర్నూలు నుంచి హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు.

బ్లాక్‌లోనూ టికెట్లు

పండగ సీజన్‌లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం...

ప్రయివేటు బస్సుల్లో ఛార్జీలపైన చెక్‌పోస్టులలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. టికెట్ల వివరాలను ఆరా తీస్తున్నాం. బస్సు ఛార్జీల బుకింగ్ యాప్‌లలో కూడా వివరాలను పరిశీలిస్తున్నాం. ఎక్కడైనా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, డిటిసి, కర్నూలు.

సమస్యలు పరిష్కరించకపోతే

ఉరుమై మెరుస్తాం...

- డప్పు పండగ సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం
- ఎపిడికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

భారత సమాజంలో అత్యంత పురాతన సంప్రదాయ కళగా ఉన్న డప్పు కళను ఆదరించి, డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరిస్తే జజ్జనకర జనారే అంటూ ఉత్సాహ పరుస్తామని, మా సమస్యలను మరుగునపరిచే పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉరుమై మెరుస్తామని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ఆనంద్ బాబు హెచ్చరించారు. బుధవారం దామోదరం సంజీవయ్య సొంతూరు పెద్దపాడులో డప్పు పండగ సాంస్కృతిక ఉత్సవాలను బహుమతుల ప్రదాత తిరుమలేశ్వర రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఎండి అంజిబాబు మాట్లాడుతూ అనేక పండుగలు, సంబరాల సందర్భంగా వివిధ రూపాల కళలకు పోటీలు నిర్వహిస్తున్న సమాజం, ఆదిమ కళగా ఉన్న డప్పును మాత్రం మరిచిపోయిందన్నారు. దళితులు వృత్తిగా ఎంచుకున్న కళగా నేటికీ వివక్షకు గురవుతూనే ఉందన్నారు. డప్పు ఔన్నత్యాన్ని సమాజం ముందు ఉంచడంతోపాటు, డప్పు కళాకారుల సమస్యలను పాలకవర్గాలు చర్చించే విధంగా చేయడంలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఈ డప్పు పండగ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. పోరాడి రూ.3000 పెన్షన్ ను సాధించుకుంటే.. అదే నేటికీ కొనసాగుతుందని, ఆతరువాత ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. పెన్షన్ వయసు 45 సంవత్సరాలకు తగ్గించాలని, ఆత్మగౌరవంగా బతికేందుకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, ప్రయాణాల్లో రాయితీలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి పెన్షన్ రూ 5000 కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన డప్పు పోటీలలో కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు చెందిన 40 టీములు ప్రదర్శన ఇచ్చాయి. డప్పు పండగ సాంస్కృతిక ఉత్సవాల నిర్వాహకులు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ చక్రపాణి, ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, కరుణాకర్, కెజిబిఎస్ జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు గురుస్వామి, భాస్కర్, బతకన్న, జిల్లా నాయకులు రమణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, మదన గోపాల్ వివిధ గ్రామాల నుండి హాజరైన మరో 200 మంది డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి.మౌర్య

ల్యాండ్ టైటిలింగ్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు సిసిఎల్ఎ ఇంతియాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన విజయవాడలో నుండి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రం నుండి జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ జిల్లాలో అసైన్డ్ భూముల రికార్డ్స్ వెరిఫై చేస్తున్నామని, జిల్లాలోని అన్ని గ్రామాలలో పూర్తి చేసిన డేటా ఉందని, వాటికి సంబంధించి గ్రామాల వారీగా కూడా సమీక్షలు నిర్వహించుకుని త్వరగా రికార్డులు వెరిఫికేషన్ పూర్తి చేస్తామన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ భూపరిపాలన ప్రధాన కార్యదర్శికి జాయింట్ కలెక్టర్ వివరించారు.

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ స్థల పరిశీలన

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు త్వర త్వరగా అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవతో సిఎం జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే వర్చువల్‌గా గత నెలలో భూమి పూజ చేశారు. బుధవారం అధికారులు పత్తికొండ- హోసూరు రోడ్డులో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి , అగ్రికల్చర్ ప్రాజెక్ట్ జోనల్ ఆఫీసర్ సుభాష్ , ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, ఈర్లగుట్ట ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.పది కోట్లవ్యయంతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంతో అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం ఫ్యాక్టరీ ఏర్పాటుకు 3 ఎకరాల విస్తీర్ణం అవసరం కాగా ప్రాథమికంగా 1.6 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణాలకు అనుగుణంగా భూమి చదును చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. త్వరలో ఫ్యాక్టరీ నిర్మాణం పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే శ్రీదేవి అధికారులకు సూచించారు. వారి వెంట తహశీల్దార్ విష్ణు ప్రసాద్ పత్తికొండ ఎంపిపి నారాయణదాసు, వైసిపి నాయకులు, బనగాన శ్రీనివాసులు, మాజీ సర్పంచి సోమశేఖర్, టిఎండి హుస్సేన్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి, అధికారులు

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-గూడూరు

గూడూరులో గూడూరు పర్యటనకు వచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ భాగేల్ కు సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికులు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని వినతి పత్రాన్ని ఇచ్చారు. కేంద్రమంత్రికి సమస్యలను వివరించారు. అంగన్వాడి కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని 30 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం అంగన్వాడీలతో చర్చించడానికి కూడా ఇష్టపడడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టించుకోవడంలేదన్నారు. కేంద్రమంత్రి సత్యపాల్ సింగ్ భగెల్ స్పందిస్తూ... వెంటనే కేంద్ర ప్రభుత్వానికి తెలిపి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలాగా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంగన్వాడి కార్మికులు సుజాత, మహేశ్వరి, రాజేశ్వరి, మరియమ్మ,సలోని,ప్రశాంతి,లక్ష్మి,రామలక్ష్మి పాల్గొన్నారు.



గూడూరులో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

స్పందించకుంటే గుణపాఠం తప్పదు

- 30వ రోజు కొనసాగిన సమ్మె

కర్నూలు అగ్రికల్చర్ : సమస్యలను పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించిన రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికలో తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ నాయకులు హెచ్చరించారు. బుధవారం అంగన్వాడీల సమ్మె 30వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, ఆదోని అంగన్వాడి యూనియన్ నాయకురాలు వరలక్ష్మి కర్నూలు ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం తెలివి లేని చర్యగా అభివర్ణించారు. అంగన్వాడీలను గౌరవ వేతనం తీసుకుంటున్న స్కీం వర్కర్లని ప్రకటిస్తూ మరోపక్క అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, అవాకులు, చవాకులు పేలడం పోగాలం దాపురించి నప్పుడు మాట్లాడే మాటలుగా గుర్తిస్తున్నామన్నారు. తాము ప్రభుత్వానికి సమ్మె నోటిస్ ఇచ్చి సమ్మె చేస్తున్నామని, ఇది చట్టబద్ధమైన సమ్మె అని, ప్రభుత్వం ఆ రోజే ఎందుకు తమకు అత్యవసర సర్వీసుగా ప్రకటిస్తున్నామని చెప్పలేదని, 27 రోజుల తర్వాత పరిపాలన చేతకాని జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు తాము సమ్మె విరమించబోమని, ఆ తర్వాత తమ సత్తా ఏమిటో ప్రభుత్వానికి ఎన్నికలలో చూపిస్తామని హెచ్చరించారు. దీక్షలలో హుసే నాపురం సెక్టార్ టీచర్లు ఆయాలు 24 గంటల దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్ష శిబిరానికి సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్, నగర ఉపాధ్యక్షులు మొహమ్మద్ రఫి, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు, అంగన్వాడి జిల్లా అధ్యక్షులు రేణుకమ్మ, పుష్ప నాయకత్వం వహించారు.



కర్నూలు నగరంలో మాట్లాడుతున్న నాయకులు



క్లాప్ డ్రైవర్ల సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న విజయ్‌రామాంజనేయులు

25వ రోజు మున్సిపల్ క్లాప్ డ్రైవర్ల సమ్మె

కర్నూలు కార్పొరేషన్: కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్‌డ్రైవర్లు బుధవారం 25వ రోజు సమ్మెచేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వైసిపి ప్రభుత్వం, రెడ్డి ఏజెన్సీ, మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఓల్డ్ సిటీ సిఐటియు నగర నాయకులు డి.కుమార్ అధ్యక్షత వహించారు. సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం. విజయ రామాంజనేయులు, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, డి.అబ్దుల్ దేశాయ్‌లు మాట్లాడారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు మొద్దు నిద్రపోతున్నారు విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో క్లాప్ డ్రైవర్ల యూనియన్ నాయకులు రఘు శేఖర్, రాజేష్, గౌడ్ , చంద్రశేఖర్, పరమేష్, షఫీ ,నవీన్, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పథకాలు సాధించిన వారికి టిజివి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నంద్యాల జిల్లాలో ఇటీవల జరిగిన తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో విజయంసాధించిన క్రీడాకారులను బుధవారం మాజీ ఎంపి టిజి.వెంకటేష్ అభినందించారు. జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పథకాలు, సర్టిఫికెట్లు సాధించడాన్ని ఆయన హర్షం వ్యక్తం చేశారు. మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. కర్నూలు జిల్లా టైక్వాండ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ వెంకటేష్ మాట్లాడుతూ ఆత్మ రక్షణకు తైక్వాండో వంటి క్రీడల్లో సాధన చేసి సర్టిఫికెట్లతోపాటు, దేహదారుఢ్యాన్ని మెరుగుపడుతుందన్నారు. నంద్యాలలో జిల్లాపోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారిలో శ్రీలలిత, సూర్య, భార్గవ్, విశ్వాస రావు, సిల్వర్ మెడల్ సాధించిన వారిలో ఉదయ్‌సింహ, ఎన్ఎస్ మల్లేష్, మనీష, బ్రాంజి మెడల్ సాధించిన వారిలో హరికృష్ణ, నరసింహ, భూపతి ఉన్నారు. కృష్ణవంశీ, టి. తిలక్, కిల్. టి సాయి కష్ణ, మాస్టర్లు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ నీటిని తాగొద్దు

జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఫ్లోరైడ్ నీటిని తాగకూడదని, ఆహార పదార్థాల తయారీకి వాడకూడదని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి.సుధాకర్ అన్నారు. సోమవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఆడ)లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యులకు హై రిస్క్ గర్భవతులకు అందించాల్సిన సమగ్ర సేవలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి.సుధాకర్ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని వంటలలో ఉపయోగించడం వలన , నీటిని తాగిన గర్భవతులకు ప్రేగు గోడలు దెబ్బతిని శరీరంలో ఐరన్‌ను శోషించు బడదని, గర్భవతులకు గర్భస్రావం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని తాగడం వలన గర్భిణికి రక్తహీనత రావచ్చునని తెలిపారు. దీర్ఘకాలిక ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న గర్భిణిలలో పుట్టబోయే శిశువులకు దంతాలు ప్రారంభ దశలో వారి పండ్లు యెగుడు, దిగుడుగా ఉంటాయని, పిల్లలు మరుగుజ్జుతనానికి లోనవుతారని తెలిపారు. గర్భధారణ సమయంలో జంక్ ఫుడ్స్ తినడం, శీతల పానీయాలు తాగడం వంటివాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఫ్లోరోసిస్ ఉన్న ప్రాంతాలలో గర్భిణీలు క్యాల్షియం, ఐరన్, విటమిన్-సి, జింక్ కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యులు, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి సుధాకర్



పగడాల జల్లబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

పగడాల జల్ల బాబు సంస్మరణ సభ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కళామతల్లి ముద్దుబిడ్డ కర్నూలు కళాకారుడు పగడాల జల్లబాబు సంస్మరణ సభ బుధవారం కర్నూలు నగరం మార్కెట్ యార్డులోని గల విశ్వకళా సమితిలో జరిగింది. కళాకారులందరూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. హనుమాన్ కళా సమితి అధ్యక్షులు పి. హనుమంతరావు చౌదరి కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బసవరాజు, సంగీత గురువులు పీజీ వెంకటేశ్వర్లు ఘననివాళులు అర్పించారు. పి.హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ జల్లాబాబు రంగస్థలం కళాకారుడుగా రాణిస్తూ కర్నూలు నగరంలోని అనేక వేదికలపై తన ప్రతిభను చాటుకున్నారన్నారు. మంచి నటుడు, సాటి కళాకారులకు సహాయం చేస్తూ నిరంతరం కళాకారులకు చేయూతను అందిస్తూ తన గురువుల పట్ల ప్రేమతో వ్యవహరిస్తూ కళామతల్లి సేవలో జీవితం కొనసాగించాడన్నారు. కర్నూలు జిల్లా కళాకారులు అందరికీ సుపరిచితులన్నారు. జల్లబాబు లేని లోటు తీర్చలేనిదన్నారు. ప్రతి సంవత్సరము జల్లబాబు సంస్మరణ సభ నిర్వహించి ప్రతిభావంతులైన కళాకారులచే రంగస్థల నాటకాలు ప్రదర్శిస్తామని విశ్వ కళా సమితి అధ్యక్షులు బీసన్న అన్నారు. కళాకారులు బైలుప్పల షఫీయుల్లా పీసి వెంకటేశ్వర్లు, ఎంపి బసవరాజు, లక్ష్మణరాజు, నాగరాజు శ్రీనివాసులు, చిన్నికష్ణ నతానియేలు, బాల మద్దయ్య పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిర్బంధాలను ఆపి మెగా డిఎస్‌సి వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మెగా డిఎస్‌సి విడుదల చేయాలని శాంతియుతంగా తాడేపల్లిలోని సిఎం కార్యాలయానికి వెళుతున్న వందమందికి పైగా డివైఎఫ్ఐ నాయకులను, నిరుద్యోగులను అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్లకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్టులను ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి నేడు మోసం చేశారని విమర్శించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, రాష్ట్రంలో ఖాళీ పోస్టల భర్తీ, ప్రతి సంవత్సరం మెగా డిఎస్‌సి అని నమ్మపలికి యువతతో ఓట్లు వేయించుకున్నారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 20వేల టీచర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సి ప్రకటించలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-సి బెళగల్



సి బెళగల్ మండలం పోలకల్, బ్రాహ్మణ దొడ్డి ఆయా గ్రామాల్లో డిఎస్‌పి విజయ్ శేఖర్ బుధవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్ఐ మన్మథ విజయ్ సమక్షంలో తనిఖీ చేసి సమస్యాత్మక గ్రామాలపై నిఘా వేయాలని డిఎస్‌పి సూచించారు. ఓటర్లకు సౌకర్యాలు ఉండేలా తగు చర్యలు చేపట్టాలని సంబంధించిన అధికారులను కోరారు. ఓటర్లు సజావుగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, గ్రామాల్లో రాజకీయ కుట్రలో భాగంగా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడుమూరు సిఐ మన్సురుద్దీన్,పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉత్తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

క్లస్టర్ వర్సిటీ విసి సాయి గోపాల్

కెవిఆర్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక కెవిఆర్ మహిళా జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ లాలప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్‌తో పాటు డివిఇఒ జమీర్‌బాష, టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న, రిటైర్డ్ ప్రిన్సిపల్ చెన్నయ్య లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని చదువుకోవాలన్నారు. కళాశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చేలా చూడాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ముఖ్య అతిధులు అందజేశారు. విద్యార్థినీలు నిర్వహించిననృత్య ప్రదర్శన అలరించాయి. కళాశాల అధ్యాపకులు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్, నరసింహా తదితరులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జిల్లా నాయకులు దుర్గాప్రసాద్, సోమన్న, మారెప్ప, హనుమన్న, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, డివిజనల్ కోఆర్డినేటర్ ఎలాగువేరా పాల్గొన్నారు. కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాశక్తి నేటి సమాజంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ నిరంతర ప్రజా సమస్యలపై కథనాలు ప్రచురిస్తుందని పేర్కొన్నారు.

డీఎస్సీ విడుదల చేయమంటే
అక్రమ అరెస్టులు సిగ్గు చేటు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిఎం కార్యాలయం ముట్టడికి వెళ్లిన నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గు చేటని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా విమర్శించారు. బుధవారం అక్రమ అరెస్టులపై ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ అభ్యర్థులు అనేకసార్లు నిరసనలు, ప్రదర్శనలు, ధర్నాలు చేసినా స్పందించకపోవడంతో 3న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించినట్లు తెలిపారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో 'చలో సిఎం కార్యాలయం ముట్టడి' చేపట్టినట్లు చెప్పారు. ముట్టడికి వెళ్లిన నిరుద్యోగులను, డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సంయుక్త, మండల అధ్యక్షులు గిరిమూర్తి మద్దతు తెలిపారు. డివైఎఫ్ఐ నాయకులు నరసింహ, నాగప్ప, ధనుంజయ్, మల్లి పాల్గొన్నారు. **దేవనకొండ**లో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడారు. మండల సహాయ కార్యదర్శి పి.రసూల్, నాయకులు రంగస్వామి, వీరేంద్ర, వీరప్ప, మురళీ, సూర్యచంద్ర పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేస్తూ మెగా డీఎస్సీని ప్రకటించి, జాబ్ కాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు.

తలకిందులుగా నిలబడి
పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


తలకిందులుగా నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల పట్ల నిరంకుశ విధానాలు అవలంభించకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కార్మికులు తలకిందులుగా నిలబడి నిరసన చేపట్టారు. బుధవారం మున్సిపల్ కార్మిక సంఘాలు, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో పట్టణంలో 16వ రోజు సమ్మె సందర్భంగా సమ్మె శిబిరంలో కార్మికులు తలకిందులుగా నిలబడి నిరసన తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా సహ కారదర్శి రంగన్న, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 15 రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా ప్రభుత్వం దిగి రాకపోవడం దారుణమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ఎఐటియుసి తాలూకా సహాయ కార్యదర్శి విజయేంద్ర, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు ఎల్లప్ప, శివ, వీరేష్, నాగప్ప, రాము, అల్లాబకాష్, కేశన్న, రంగన్న, లక్ష్మన్న, ఖాజా, ప్రతాప్, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆదోని ప్రయివేట్ ఆస్పత్రిలో
నవజాత శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ఆదోని


ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన బంధువులు

వైద్యం వికటించి నవజాత శిశువు మృతి చెందిన సంఘటన బుధవారం ఆదోనిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బంధువులు ఎస్‌కెడి కాలనీలోని ప్రయివేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బంధువుల వివరాల మేరకు... ఆదోనిలోని బోయగేరికి చెందిన గర్భిణి బోయ మహాలక్ష్మికి పెయిన్‌లెస్ డెలివరీ చేస్తామని, ఇంకా వారం రోజులు సమయం ఉన్నప్పటికీ మంగళవారం రాత్రి డెలివరీ చేయడానికి ఆస్పత్రి వైద్యులు సిద్ధమయ్యారు. సాయంత్రం 6 గంటల నుంచి మొదలుపెట్టిన చికిత్స రాత్రి 10 గంటలైనప్పటికీ ఎలాంటి సమాచారమూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి యాజమాన్యాన్ని, వారి సిబ్బందిని గట్టిగా నిలదీశారు. చేసేదేం లేక చికిత్స సమయంలో బిడ్డ చనిపోయిందని వైద్యులు చేతులెత్తేశారు. ఒక్కసారిగా కుటుంబ సభ్యులు ఆగ్రహానికి గురయ్యారు. 7 సంవత్సరాల తర్వాత గర్భం దాల్చి పండంటి మగ బిడ్డకు జన్మనిస్తే వైద్యులు పురిటిలోనే పిండేశారని ఒక్కసారి రోదనలు ఆకాశాన్నంటాయి. ఇలాంటి ఘటనలు పట్టణంలో పదే పదే జరుగుతున్నా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడిందని, మిడిమిడి జ్ఞానంతో, అనుభవం లేని వైద్యుల వల్లే ఘటనలు పునరావృతం అవుతున్నాయని ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పట్టణంలో నర్సింగ్ హోమ్‌లకు సరైన అనుమతులు లేకపోగా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి హద్దులు దాటుతున్నాయి.

మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. బుధవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు గీత, ఉమా, జానకి అధ్యక్షతన ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, అధ్యక్షులు రామాంజనేయులు, ఎఐటియుసి నాయకులు వీరేష్, విజయ్ మాట్లాడారు. 30వ రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఎన్ని రోజులైనా సమ్మెకు సిద్ధంగా ఉంటామన్నారు. గీత, విమల, పద్మ, లలిత, ఉమా, లక్ష్మీదేవి, ఆంథోనమ్మ, శారద, గౌసియా, గీతా, ఈరమ్మ పాల్గొన్నారు. **ఆలూరు**లో 30వ రోజు సమ్మెలో భాగంగా శిబిరంలో అంగన్వాడీలు ఉరి వేసుకొని నిరసన చేపట్టారు. అంగన్వాడీలకు సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తమ రావు, షాకీర్ మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు భారతి, డివైఎఫ్ఐ నాయకులు మైనా, అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో సచివాలయ సిబ్బంది చేత సరుకుల పంపిణీని చేపట్టడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలు గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. రైతుసంఘం జిల్లా నాయకులు పరమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, సుకన్య, థెరిస్సమ్మ, ఆదిలక్ష్మి, అరుణ పాల్గొన్నారు. అంతకుముందు అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 30 రోజులు కావడంతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట 30 ఆకారంలో బైఠాయించి నిరసన చేపట్టారు. **కోసిగి**లో అంగన్వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని 30 రోజులుగా సమ్మె చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీరి సమస్యలు పరిష్కరించకుండా అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాయకులు రాముడు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో అంగన్వాడీల సమ్మె 30 రోజుకు చేరింది. 30 రోజు సందర్భంగా అంగన్వాడీలు 30 ఆకారంలో కూర్చుని నిరసన చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి గోవర్ధనమ్మ, నాయకులు నీరజ, శైలజ, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు పాల్గొన్నారు.


ఆదోనిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


ఆలూరులో ఉరేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


కోసిగిలో మాట్లాడుతున్న రామాంజనేయులు


పెద్దకడబూరులో...

భువనేశ్వరికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - ఆదోని

'నిజం గెలవాలి'లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పర్యటన సాగింది. మంగళవారం రాత్రి ఆదోనిలోని చేకూరి ఫంక్షన్ హాలులో ఆమె బస చేశారు.


చేకూరి ఫంక్షన్ హాలు వద్ద ఉన్న టిడిపి నాయకులు

బుధవారం భారీ ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు చేకూరి ఫంక్షన్ హాలు వద్దకు చేరుకున్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేసి టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బైపాస్ రోడ్డు మీదుగా ఎమ్మిగనూరుకు చేరుకున్నారు. అంతకుముందు ఆదోనిలో ఆమెకు టిడిపి, జనసేన నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, కార్యదర్శి బుద్ధారెడ్డి, తిమ్మప్ప, రంగస్వామి నాయుడు, మారుతి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సాదీ రావుఫ్, ఉమ్మి సలీం, రామచంద్ర, సోమశేఖర్ రెడ్డి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, గుడిసె శ్రీరాములు, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, నాయకులు రాజశేఖర్, ప్రకాష్, పులి రాజు ఉన్నారు.


భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లప్ప

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి ఆర్‌బికెలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం క్యాలెండర్లను బుధవారం రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు రెడ్డి, రంగస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది మండలంలోని రైతులు కరువుతో నష్టపోయారని, ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించినప్పటికీ గ్రామాల్లో కరువు సహాయక చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. గ్రామాల్లో రైతులు పశుగ్రాసం లేక పశువులను సంతలకు తీసుకెళ్లి అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువుతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పంట నష్టపరిహారం ఇచ్చి రైతులు ఆదుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సంబంధిత అధికారులు రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపిఇఒలు జ్యోతిర్మయి, అనిల్ నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి బి.రామాంజనేయులు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, డివైఎఫ్ఐ మండల నాయకులు మురళీ, నాగరాజు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- నారా భువనేశ్వరి - రూ.3 లక్షల చొప్పున చెక్కుల అందజేత

ప్రజాశక్తి - గోనెగండ్ల

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. కొద్ది నెలల క్రితం చంద్రబాబు నాయుడును రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసి, జైల్లో నిర్బంధించిన సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన టిడిపి కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేసే 'నిజం గెలవాలి' కార్యక్రమం చేపడుతున్నారు. బుధవారం గోనెగండ్ల మండలంలో కొనసాగింది. చంద్రబాబు నాయుడును జైల్లో నిర్బంధించిన సమయంలో మండలంలోని బి.అగ్రహారం గ్రామానికి చెందిన సుధాకర్ నాయుడు, అల్వాల గ్రామానికి చెందిన ఈరన్న, ఎర్రబాడు గ్రామానికి చెందిన కౌలుట్లయ్య మృతి చెందారు. 'నిజం గెలవాలి' ద్వారా వీరిని పరామర్శించేందుకు భువనేశ్వరి ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ.జయ నాగేశ్వర రెడ్డితో కలిసి ముందుగా బి.అగ్రహారం గ్రామంలోని సుధాకర్ నాయుడు ఇంటికి చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతుని భార్య, కుమారులతో మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే అండగా ఉంటామని భరోసానిస్తూ మృతుని భార్య రాధమ్మకుకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం అల్వాల గ్రామానికి చేరుకొని ఆరేకంటి ఈరన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతుని భార్యతో మాట్లాడి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. చివరగా ఎర్రబాడు గ్రామంలో మృతి చెందిన కౌలుట్లయ్య ఇంటికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి మహిళా నేతలు కోట్ల సుజాతమ్మ, గౌరు చరితారెడ్డి, పంచుమర్తి అనురాధ, గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి జిల్లా మహిళా నాయకులు ముంతాజ్ బేగం, టిడిపి మండల నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, రామాంజనేయులు, బేతాళ బడేసాబ్, గోనెగండ్ల సర్పంచి హైమావతి, అల్వాల సర్పంచి బాష, అనంత రెడ్డి, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు, పూజారి చంద్ర, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, నూర్ అహ్మద్, మదీన, ఫక్రుద్దీన్, భారతం రహమతుల్లా, చిన్ననేలటూరు నాగన్న, గాజులదిన్నె సంజన్న, చంద్ర, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని మాచాపురం, ముగతి గ్రామాల్లో మరణించిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మాచాపురం గ్రామానికి చెందిన కొండా హనుమంతు, ముగతి గ్రామానికి చెందిన హరిజన నాగరాజు గుండెపోటుకు గురై మృతి చెందారు. వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల చెక్కును అందించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ అనురాధ, మాజీ జడ్‌పి వైస్ ఛైర్మన్ పుష్పవతి, టిడిపి నాయకులు ఈరన్న గౌడ్, నాగరాజు గౌడ్, మాధవరావు దేశాయి, బండే గురుస్వామి, గురురాజు దేశాయి, ఖాసీం వలీ, రైస్ మిల్ నారాయణ రెడ్డి, ధర్మపురం గోపాల్, గజేంద్ర రెడ్డి, దావీదు, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, భార్గవ్, పరశురాముడు, ఆదిశేషు, పీర్ సాబ్ పాల్గొన్నారు.


బి.అగ్రహారంలో రాధమ్మకు చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి


నందవరంలో చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

తాగు నీటి వృథాను అరికట్టాలి

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం ముందు తాగునీటి పైపులైను లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు లక్ష్మన్న, సుదర్శన్, నాయకులు వీరేష్, గోపాల్, విజయ్, తిప్పన్న, రామాంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం పైపులైను లీకేజీ ప్రాంతంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ... కొన్ని రోజులుగా పైపు లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని తెలిపారు. ఇప్పటికే శివారు కాలనీలో తాగునీరు వారానికోసారి కూడా సరఫరా కావడం లేదన్నారు. నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే పాత పైపులైను స్థానంలో కొత్త పైపు లైను వేయాలన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

- వైకుంఠం మల్లికార్జున చౌదరి

- క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేత

ప్రజాశక్తి - చిప్పగిరి

క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం మల్లికార్జున చౌదరి తెలిపారు. బుధవారం చిప్పగిరిలో ఖోఖో క్రీడాకారులకు క్రీడా దుస్తులను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో బలమైన స్నేహాలు ఏర్పడతాయని, ఆరోగ్యం కూడా దృఢంగా ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు తమను ప్రోత్సహిస్తున్న టిడిపి నేత వైకుంఠం మల్లికార్జున చౌదరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి యువ నాయకులు అమరేష్, ఉమాపతి చౌదరి, చిరంజీవి, జహీర్ పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు సర్పంచి ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిప్పగిరి

కుటుంబాన్ని పోషించే పెద్ద అనారోగ్యంతో మృతి చెందడంతో సర్పంచి ప్రేమ్ కుమార్ దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబమంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్పంచి ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో కుటుంబం యజమాని రాముడు (54) అనారోగ్యంతో మృతి చెందారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి మానవతా దృక్పథంతో దహన సంస్కారాల నిమిత్తం సర్పంచి ప్రేమ్ కుమార్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ఎస్‌పి.సింగ్ బఘేల్

ప్రజాశక్తి - నందవరం

పేదల అభివృద్ధి, సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ఎస్‌పి.సింగ్ బఘేల్ తెలిపారు. బుధవారం నందవరంలో ఎంపిడిఒ దశరథ రామయ్య, సర్పంచి సావిత్రిల ఆధ్వర్యంలో భారత్ వికసిత్ సంకల్ప యాత్ర చేపట్టారు. మంత్రి ఎస్‌పి.సింగ్ బఘేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, వైఎస్ఆర్ క్రాంతి పథం, వ్యవసాయ, వైద్య, ఆరోగ్యశాఖ, ఇరిగేషన్, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించే పిఎం కిసాన్, కిసాన్ సమృద్ధి యోజన, జల జీవన్ మిషన్, ఉజ్వల గ్యాస్ సిలిండర్, ఉచిత బియ్యం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, విద్యుత్, మరుగుదొడ్లు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ పథకాల గురించి వివరించారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ సిలిండర్లు, మంజూరు పత్రాలను ఆయన చేతుల మీదుగా అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు ప్రదర్శించిన కళా నృత్య ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డిఇఒ రంగారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సలీం బాష, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డిఎల్‌పిఒ నాగరాజ్ నాయుడు, జిఆర్‌బి ఎస్ఇ రాజశేఖర్ రెడ్డి, డిఎంహెచ్ఒ రామ గిడ్డయ్య, డిస్ట్రిక్ సర్వేయర్ శ్రీనివాసరాజు, హౌసింగ్ ఇఇ రవికుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి రామచంద్రయ్య, సర్పంచి సావిత్రి, ఎంపిడిఒ దశరథ రామయ్య, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, వైసిపి మండల నాయకులు శివారెడ్డి గౌడ్, ఎంఇఒలు సుదర్శన్ రెడ్డి, రఘునాథ్, వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ చిన్న వీరన్న, సిసిలు సబీనా, జనార్ధన్, శారదా దేవి, భాగ్యమ్మ, ఆదిలక్ష్మి, మహాలక్ష్మి, ఆనంద్, త్రివేణి, గాయత్రీ, నాగరత్నమ్మ, గిరిజ, సురేష్, బసవ, అరుణ, వెంకటేష్, రాణి, ప్రసాద్, మద్దీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని గజ్జహల్లి గ్రామంలో భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ఆరోగ్య సహాయ శాఖ మంత్రి ఎస్‌పి.సింగ్ బఘేల్ పర్యటించారు. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, సర్పంచి నాగమ్మ, డిఎల్‌పిఒ నాగరాజు నాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు నీలకంఠ, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిదానంద, తాలూకా కన్వీనర్ వెంకటరాముడు, మండల అధ్యక్షులు నరసింహ ప్రసాద్, జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ రామలింగ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుధా పాల్గొన్నారు.


హోళగుందలో మాట్లాడుతున్న మంత్రి బఘేల్


పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా గ్రామ దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని మురళీ, గుడికంబాలి, తిప్పలదొడ్డి గ్రామాల్లో మారికాంబ దేవి దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామ దేవతకు గ్రామస్తులు కుంభాలతో వెళ్లిపూజలు నిర్వహించారు. గ్రామాల్లో తమ అభిమాన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, గ్రామాల్లో మిఠాయి, గాజుల అంగళ్లు, వివిధ వ్యాపార సముదాయాలతో కళకళలాడాయి.

గ్రామ దేవతను దర్శించుకున్న నాయకులు

దేవర ఉత్సవాల సందర్భంగా వైసిపి, టిడిపి నాయకులు గ్రామ దేవతలను దర్శించుకున్నారు. వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజ్ గౌడ్, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, అవతారం, చౌదరి బసవరాజ్, అబ్దుల్ సమద్, శివరాం, గోపాల్ రెడ్డి, భీమేష్ పాల్గొన్నారు. అలాగే తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, మాధవరం రామి రెడ్డి కుమారులు రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, పల్లెపాడు రాంరెడ్డి, మండల నాయకులు చెన్న బసప్ప, వెంకటపతి రాజు పాల్గొని పూజలు నిర్వహించారు.

ఆర్‌డిటి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సూగూరు గ్రామంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, రీజనల్ డైరెక్టర్ రామేశ్వరి చేతుల మీదుగా ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు కుట్టు మిషన్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో మహిళలు స్వతంత్ర, ఆర్థిక ఎదుగుదలకు టైలరింగ్ వృత్తి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బాలికలు అభివృద్ధి చెందాలంటే విద్యావంతులు కావాలని సూచించారు. తల్లిదండ్రులు అబ్బాయిలతో పాటు అమ్మాయిలను కూడా చదివించి విజ్ఞానాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన 43 నూతన గృహాలను ప్రారంభించారు. ఎటిఎల్ కృష్ణయ్య, ఉప సర్పంచి గోపీనాథ్, జైభీమ్ ఎంఆర్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి హనుమన్న గర్జి, ప్రభాకర్, జనార్ధన్, సోమన్న పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు


ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

జగనన్న పెన్షన్ కానుకలో కోత

- ఎంపిడిఒకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - కౌతాళం

జగనన్న పెన్షన్ కానుక పంపిణీలో వాలంటీర్లు కోత విధిస్తున్నారని టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం కౌతాళం ఎంపిడిఒ సుబ్బరాజుకు ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ శివ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పింఛనుదారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇస్తే, బాపురం గ్రామంలో మాత్రం రూ.2,750 పంపిణీ చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్లపై ఆధారపడి ఉంటే, గ్రామ నాయకుల పేరుతో రూ.250 కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. విచారణ చేసి వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ సుబ్బరాజు మాట్లాడుతూ... గ్రామ సచివాలయ అధికారులతో విచారణ చేపట్టి పింఛనుదారులకు రూ.3 వేలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడా రంగానికి పెద్దపీట : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం


కౌతాళంలో పోటీలను ప్రారంభిస్తున్న ప్రదీప్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో క్రీడా రంగానికి పెద్ద పీట వేసినట్లు వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి తెలిపారు. మంగళవారం 'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారులను వెలికి తీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర'కు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగాల్లో రాణించాలని తెలిపారు. ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ నాగరాజు గౌడ్, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, ఉప సర్పంచి తిక్కయ్య, నాయకులు ఏకం రెడ్డి, రామన్న గౌడ్, రాఘవేంద్ర రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజు, ఎంఇఒ సుధారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి గోవిందరాజులు, అధికారులు

చిప్పగిరి : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం 'ఆడుదాం ఆంధ్ర'ను చేపట్టిందని సర్పంచి గోవిందరాజులు, ఎంపిడిఒ కొండయ్య, ఎంఇఒ బాల నాయుడు తెలిపారు. మండలంలోని బిల్లోన గ్రామంలో 'ఆడుదాం ఆంధ్ర' మండలస్థాయి పోటీలను సర్పంచి గోవిందరాజులు, ఎంపిడిఒ కొండయ్య ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చిప్పగిరి సర్పంచి డి.గోవిందరాజులు, ఎంఇఒ బాలనాయుడు హాజరయ్యారు. బెల్డోన గ్రామ సచివాలయ పరిధిలో బసవన్న బావి వద్ద ఉన్న గ్రౌండ్‌లో బెల్డోన సచివాలయ టీం, రామదుర్గం గ్రామ సచివాలయం టీం మధ్య ఎంపిడిఒ టాస్ వేసి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో బిల్డోన గ్రామ సచివాలయ జట్టు 10 ఓవర్లలో 79 పరుగులు చేయగా, ఛేదనలో రామదుర్గం జట్టు 49 పరుగులు చేసింది. బెల్డోన గ్రామ సచివాలయ జట్టు 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, నరేంద్ర, సిసింద్రీ, నరసింహులు, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ఆస్పరి : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సర్పంచి మూలింటి రాధమ్మ, కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిడిఒ రాణెమ్మ అధ్యక్షతన మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' చేపట్టారని తెలిపారు. గెలుపోటములు సహజమని, అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి క్రీడలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంఇఒ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచి రాధమ్మ





మిడుతూరులో షోకాజ్ నోటీసులను దహనం చేసిన నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సాగు భూమిపై గ్రీన్‌కో కన్ను

- రెవెన్యూ అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకించిన రైతులు - బలవంతంగా పొలాల్లో సర్వేలు



జెసిని కలిసేందుకు వచ్చిన కలెక్టరేట్ వద్ద భూ భాదిత రైతులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో గ్రీన్‌కో సోలార్ కంపెనీ దౌర్జన్యం పెరిగిపోతుంది. జిల్లా అధికార యంత్రాంగాన్ని, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులను తన గుప్పెట్లో పెట్టుకొని గ్రీన్‌కో సామ్రాజ్యాన్ని విస్తరింపజేయాలనే ఆలోచనతో ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంది. రైతులు భూములు ఇవ్వక పోయినా బలవంతంగా లాక్కుంటున్నారు. అరకొర నష్టపరిహారం చెల్లిస్తూ రైతులకు శఠగోపం పెడుతున్నారు. ఇటీవల పిన్నాపురంలోను ఇదే పరిస్థితి. పోలీస్, అధికారుల ప్రజా ప్రతినిధుల అండతో వేల ఎకరాలను కొట్టేశారు. చాలా మంది రైతులకు ఇంకా నష్టపరిహారం ఇవ్వలేదనే విమర్శలు ఉన్నాయి. అది పూర్తి కాక ముందే ఇప్పుడు బనగానపల్లెపల్లె నియోజకవర్గం యాగంటి పరిసర ప్రాంతాలపైన గ్రీన్‌కో కన్నేసింది.

బనగానపల్లె మండలం యాగంటి దేవస్థానంతోపాటు చుట్టు పక్కల ఉన్న దాదాపు 650 ఎకరాల భూమిని సేకరిస్తుంది. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ద్వారా గ్రీన్ కో కంపెనీ నిర్మించే పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ కోసం భూములు సేకరిస్తున్నట్లు పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు గ్రీన్‌కోకు మా భూములు ఇవ్వబోమంటూ తిరుగబడుతున్నారు. ఈ నెల 31న జరిగే గ్రామ సభల్లో రైతులు ఆమోదం తెలుపాలని రెవెన్యూ అధికారులు హుకుం జరిచేసినట్లు సమాచారం. ఈ విషయం పైన బుధవారం పాతపాడు, పెత్తేనగర్, పసుపల, కటికవాణి కుంట గ్రామాలకు చెందిన భూ భాదిత రైతులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ భూములను సోలార్ ప్రాజెక్ట్‌కు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం ప్రాజెక్టుకు ఈ భూములను అప్పగిస్తే ఆ భూముల పైన ఆధారపడి జీవించే ఎన్నో కుటుంబాలు అంతరించిపోతాయంటూ రైతులు వాపోయ్యారు. మా కుటుంబాలు ఆ భూములపైన ఆధారపడి ఉన్న పశుసంపదను కాపాడుకోవడం కష్టమౌతుందన్నారు. ఈ భూములు పోతే మా కుటుంబాలకు ఆత్మహత్యలే శరణ్యమని, ఇంతకంటె మాకు వేరే దారులు లేవంటున్నారు. భూములు లాక్కొని రైతుల కుటుంబాలను నాశనం చేయవద్దని, బాధిత రైతులు జిల్లా ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ సోలార్ ప్రాజెక్టులో యాగంటి దేవస్థానం భూములను కూడా పోతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్‌కు భూములు ఇచ్చే ప్రసక్తి లేదని, బలవంతంగా లాక్కోవాలని చూస్తే తిరుగ బడుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

సర్వే పనులు ఆపాలి : రైతు జక్కల అశోక్ చక్రవర్తి



గ్రీన్ కో... జెన్‌కో పవర్ ప్రాజెక్ట్ కోసం బలవంతంగా మా భూములను లక్కోవడానికి సోలార్ కంపెనీ వాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఈ భూములు పోతే మాకు ఆధారం లేదు. కాబట్టి భూములు సోలార్ కంపెనీకి ఇచ్చేందుకు సిద్ధంగా లేం. గ్రీన్ కో కంపెనీ వాళ్లు మా భూముల్లో సర్వే చేయడం మానుకోవాలి.

రెండు పంటలు పండే భూమి ఇవ్వలేం: రైతు జి.వెంకట రామిరెడ్డి



గ్రీన్ కో కంపెనీ వాళ్లు పవర్ ప్రాజెక్ట్‌ను కడుతున్నారు. అందుకు పాతపాడు పెత్తే నగరం, పసుపల కటిక వాణి కుంట గ్రామాలకు చెందిన రెండు కార్ల పంట పండే సారమంతమైన భూములను లాక్కుంటున్నారు. ప్రజల అనుమతులు లేకుండా పొలాల్లో సర్వే చేస్తున్నారు. నాకు 7.12 ఎకరాలు ఉంది. ఈ పొలం పోతే మా జీవనం కష్టమవుతుంది. పొలం లేకుండా పోతే మాకు జీవనోపాధి లేకుండా పోతుంది. ప్రభుత్వం ఆలోచించాలి.

భూమి ఇస్తే ఎలా బతకాలి : బి.రామేశ్వర్ రెడ్డి, ఎంపిటిసి



నాకు 4.30 ఎకరాలు ఉంది. ఇన్నాళ్లు అదే భూమిని నమ్ముకొని బతుకుతున్నాం.. ఉన్న ఫలంగా భూములు పవర్ ప్రాజెక్ట్ కు కావాలని బలవంతంగా లాక్కుంటే బతికేదెలా. మా పిల్లల భవిష్యత్ ఏమిటి.. ప్రాజెక్టులకు సాగుకు పనికి రాని భూములను తీసుకోవాలి. రెండు పంటలు పండే మంచి భూములను కాదు. మేము మా భూమి ఇచ్చేందుకు సిద్ధంగా లేం.

సారవంతమైన భూమి ఇవ్వలేం : రైతు గోపాల్ రెడ్డి



ఎకరాకు 45 నుండి 50 బస్తాలు వరకు పంట వస్తుంది.. భూమి విలువ కూడా బాగుంది. గ్రీన్ కో కంపెనీకి భూములు తీసుకుంటున్నామని అధికారులు గజెట్ ప్రకటించడం బాధ కలిగి గిస్తుంది. ఈ పొలం పోతే జీవనాధారం కష్టం.. గ్రీన్ కోకు భూములు ఇవ్వడం కరెక్ట్ కాదు.

షోకాజ్ నోటీసులపై ఆగ్రహం

- మిడుతూరులో నోటీసులు దగ్ధం
- బండి ఆత్మకూరులో ఎంపీ, ఎమ్మెల్యేల అడ్డగింత
- ఆత్మకూరులో ఉరితాళ్లతో నిరసన - 30వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె 30వ రోజు బుధవారం కొనసాగింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అధికారులు షోకాజ్ నోటీసులు అందజేయడం, ఇళ్లకు అంటించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవిన్యూ అధికారులను ఇండ్ల వద్దకు పంపి నోటీసులు అంటించడం, చట్టం ద్వారా ఉద్యోగాలు తీసివేసి కేసులు పెడతామని బెదిరించడం దారుణమన్నారు. నిర్బంధాల ద్వారా ఉద్యమాన్ని అణిచి వేయాలని ప్రయత్నిస్తే మరింత రెట్టింపుగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. మిడుతూరులో షోకాజ్ నోటీసును దహనం చేశారు. నంద్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బండి ఆత్మకూరులో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిలను అడ్డుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరులో ఉరి వేసుకుని అంగన్వాడీల నిరసన తెలిపారు.

నంద్యాల కలెక్టరేట్ : తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చేతగాని తనానికి నిదర్శనమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు విమర్శించారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా చేపట్టిన 4వ రోజు రిలే నిరాహార దీక్షలు దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మలతో కలిసి ఎ.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించమంటే వాటిని పక్కన పెట్టి మంత్రులు అబద్దాలు చెప్పుతూ సమస్యలన్నీ చర్చల్లో పరిష్కరించామని చెప్పడం సిగ్గు చేటన్నారు. సమస్యలు పరిష్కరించడానికి చేతగాని ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. సిఎంకు చిత్త శుద్ధి ఉంటే ఎన్నికల ముందు వీరికిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంగన్వాడీలతో పెట్టుకున్న ప్రభుత్వాలు గద్దె దిగక తప్పదని హెచ్చరించారు. దీక్షల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కూర్చున్నారు. కార్యక్రమం లో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి, ప్రాజెక్ట్ కార్యదర్శి సునీత, సిఐటియు నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు 30వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఉరి వేసుకుంటూ నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యాక్షులు రణధీర్ తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** అంగన్వాడి **మిగతా 6వ పేజీలో...**

సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలు పెంపొందించండి

- సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి.వవ



మాట్లాడుతున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి.వవ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలను పెంపొందించడంతో పాటు వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి.వవ జిల్లా యంత్రాంగానికి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సఫాయి కర్మచారుల కోసం జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న పథకాలపై మున్సిపల్ కమిషనర్లు, కార్మిక శాఖ, సంబంధిత అధికారులతో కమిషన్ సభ్యులు సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జాతీయ సఫాయి కర్మచారుల కమిషన్ మెంబర్ అడ్వైసర్ గిరిధర్, మెంబర్ కోఆర్డినేటర్ సందీప్ చరణ్, డిఆర్ఓ పుల్లయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో సఫాయి కర్మచారులకు చెల్లిస్తున్న వేతనాలు, వారి సమస్యలపై మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సఫాయి కర్మచారులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు అందజేస్తూ వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సఫాయి కర్మచారులు అపరిశుభ్రమైన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేయడం వల్ల వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, వీరు నివసించే ప్రాంతాల్లో తప్పని సరిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సఫాయి కర్మచారులకు ఉపాధిక కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో కర్మచారులను నియమించి వారికి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అందించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సఫాయి కర్మచారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో సపాయి కర్మాచారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలపై నివేదికలను కమిషన్ సభ్యులకు అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేతన స్లిప్, పిఎఫ్, ఆరోగ్యశ్రీ, బీమా తదితర సౌకర్యాలు అందిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్లు, కార్మిక శాఖ అధికారులు కమిషన్ సభ్యులకు నివేదించారు. సఫాయి కర్మచారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ శాశ్వత సఫాయి కర్మచారుల తరహాలోనే ఔట్సోర్సింగ్ సఫాయి కర్మచారులను కూడ గుర్తించి అన్ని సౌకర్యాలు అందించాలని కోరారు. నెలకోసారి మీటింగ్ పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా, డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు దోపిడీ



- ఇష్టారాజ్యంగా బస్సు ఛార్జీలు - ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి సెలువులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాక తప్పడం లేదు...

పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ సెలవులు ముగియడంతో కర్నూలు నుంచి హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్‌ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు.

బ్లాక్‌లోనూ టికెట్లు : పండగ సీజన్‌లో ఊరి కెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.



బహుమతిని అందుకుంటున్న షణ్ముఖ శబరీస్

భగవద్గీత శ్లోకాల పోటీల విజేతగా షణ్ముఖ శబరీస్

ప్రజాశక్తి - నంద్యాల లీగల్

సంక్రాంతి సంబరాల సందర్భంగా నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లోని కళ్యాణమండపంలో జరిగిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో విజేతగా నిలిచిన షణ్ముఖ శబరిస్ నిలిచినట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కశెట్టి కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యతను వెలికి తీయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 నుండి 12 సంవత్సరాల లోపు 200 మంది బాలబాలికలు పాల్గొన్న ఈ పోటీలలో మొదటి బహుమతిని నంద్యాల ఎస్బిఐ కాలనీలో నివాసముంటున్న కోర్టు ఎంప్లాయ్ ఎం.నరేష్ కుమారుడు ఎం.షణ్ముఖ శబరిస్ అందుకున్నట్లు చెప్పారు. విద్యార్థిని నంద్యాల బాలాజీ కాంప్లెక్స్, బాలాజీ మర్చంట్ కమిటీ నిర్వాహకులు అభినందించారు.

కాంగ్రెస్‌లోకి దాట్ల శ్రీరాములు యాదవ్

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లెకు చెందిన దాట్ల శ్రీరాములు యాదవ్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బుధవారం విజయవాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో దాట్ల శ్రీరాములు యాదవ్, జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసింహ యాదవ్, బనగానపల్లె నియోజకవర్గ నాయకులు బాలు యాదవ్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దాట్ల శ్రీరాములు యాదవ్

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు

యువత క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీడీవో డి.గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, ఎస్సై జి.అశోక్, ఎంఈఓ బాలాజీ నాయక్‌లు అన్నారు. బుధవారం ఆడుదాం-ఆంధ్ర మండల స్థాయి పోటీలను వారు ప్రారంభించారు. అంతకన్నా ముందు జాతీయ జెండాను ఎగురవేసి ఆడుదాం-ఆంధ్ర మస్కట్ లోగోను ప్రారంభించారు. అనంతరం ఆటల పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎస్సై, ఎంపీడీవోలు క్రికెట్, షటిల్ ఆడారు. అనంతరం వారు మాట్లాడుతూ తాలుకా, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు ఈ మండలం నుంచి మంచిగా ఆటల్లో పాల్గొని రాణించి రాష్ట్రస్థాయి వరకు వెళ్లాలని ఆకాంక్షించారు. గెలుపొందిన వారికి మంచి ప్రైజ్ మనీ కూడా ఉందన్నారు. ప్రతిభను కనబరిచి ఈ ప్రాంతానికి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల కార్యదర్శి నాయిని మధుసూదన్ రావు, నాయకులు ఉపేంద్ర, జనార్ధన్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు నాగరాజు, సాయి కృష్ణ, రాజశేఖర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆడుదాం-ఆంధ్ర మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐ తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభం

- పాల్గొన్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలంలోని ఏ కోడూరు, బండి ఆత్మకూర్ గ్రామాల్లో రూ. 2 కోట్ల అభివృద్ధి పనులను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఎ.కోడూరు గ్రామం వద్ద మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైసిపి నాయకుల కుమార్ బాబులు ఎంపీ, ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్, సిసి రోడ్లు, డ్రైనేజీ, జగనన్న బల్క్ మిల్క్ సెంటర్, ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రతిపక్షాలకు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదన్నారు. అనంతరం బండి ఆత్మకూరులో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను వారు ప్రారంభించారు. అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్ సమస్యగా ఉన్న కొత్త కొట్టాల కాలనీ డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. అనంతరం ఆడుదాం-ఆంధ్రలో భాగంగా ఎమ్మెల్యే కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహాల కమిటీ అధ్యక్షుడు భరత్ కుమార్ రెడ్డి, ఎ.కోడూరు సర్పంచ్ మన్నే జ్ఞానా భరణం, ఎసిడిపిఎల్ డైరెక్టర్, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు శశికళ రెడ్డి, మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు దేసు వెంకటరామిరెడ్డి, వైసిపి కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ అధ్యక్షుడు ముడిమేల పుల్లారెడ్డి, బండి ఆత్మకూరు సర్పంచ్ ఎరుకలి సంధ్య, ఉపసర్పంచ్ ఔటాల నాగేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, సహకార సంఘం అధ్యక్షులు బురం శివలింగం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్, యువ నాయకుడు చెదుళ్ల దీప్‌రెడ్డి శ్రీరామ్ రెడ్డి, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, వ్యవసాయ అధికారి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



మల్లన్న హుండీ ఆదాయం రూ. 4.83 కోట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు గడిచిన 28 రోజులలో భక్తులు హుండీలలో చెల్లించుకున్న కానుకలను బుధవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు ఆధ్వర్యంలో కళ్యాణ మండపంలో లెక్కించారు. ఇఒ మాట్లాడుతూ ఈ హుండీ లెక్కింపులో నగదు రూ.4 కోట్ల 83 లక్షల 53 వేల 238 లభించిందన్నారు. నగదుతో పాటు బంగారం 133 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, వెండి 11 కేజీల 850 గ్రాములు, యూఎస్ఏ డాలర్లు 1751, సౌత్ ఆఫ్రికా రాండ్స్ 90, కువైట్ దినార్సు 14.25, ఒమెన్ రియాల్స్ 15, యూఏఈ దిరహంస 450, కెనడా డాలర్లు 40, సింగపూర్ డాలర్ 28, ఆస్ట్రేలియా డాలర్లు 100, ఈరోస్ 10, కత్తర్ 5 లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, శివసేవకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు 'ఎస్‌డిఆర్ ఆకాంక్ష' విద్యార్థులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎస్‌డిఆర్ ఆకాంక్ష కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 11 నుండి 13 వరకు మహబూబ్ నగర్‌లో జరిగే నెట్ బాల్, 14 నుండి 16 వరకు 62వ ఫాస్ట్ ఫైవ్ నెట్ బాల్ పోటీలకు సీనియర్ ఇంటర్ విద్యార్థి బి.సాయి సుమంత్, యస్.సవి పాల్గొంటారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ విజయ శేఖర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన 2వ ఫాస్ట్ ఫైవ్, 16వ సౌత్ జోన్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో ఉమ్మడి కర్నూల్ జిల్లా నుంచి జాతీయ స్థాయి జట్టుకు తమ కళాశాల విద్యార్థులు బి.సాయి సుమంత్, సవిలు ఎంపికయ్యార నితెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ శిక్షణ ఇచ్చిన కోచ్ తేజస్వి, నవీన్ కుమార్‌లను అభినందించారు.



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ శేఖర్

12 నుండి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో ఈ నెల 12 నుండి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని దేవస్థానం ఇఒ పెద్దిరాజు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని పంచాహ్నిక దీక్షతో ఈ నెల 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని చెప్పారు. సంప్రదాయాన్ని అనుసరించి మల్లికార్జున స్వామికి సంవత్సరంలో రెండు సార్లు సంక్రాంతి, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలు 12వ తేదీన ఉదయం ఎనిమిదిన్నర గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం చేసి కార్యక్రమం ప్రారంభిస్తారని, అనంతరం లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సంకల్పం చెబుతారని చెప్పారు. ఆ తర్వాత గణపతి పూజ, చండీశ్వర పూజ, కంకణ ధారణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ వంటి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం ఏడు గంటలకు ధ్వజారోహణ ధ్వజ పతాకా విష్కరణ, ఆ తర్వాత ప్రతిరోజూ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన రెండవ రోజు నుండి వాహన సేవలు, 15వ తేదీ మకర సంక్రాంతి రోజు స్వామి అమ్మ వార్లకు కళ్యాణం, 17న పూర్ణాహుతి త్రిశూల స్నానం, 18న పుష్ప ఉత్సవం, శయనోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 14వ తేదీ సామూహిక భోగి పండ్లు కార్యక్రమం, 15న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆర్జిత సేవలు నిలుపుదల : సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్ష సేవలైన రుద్ర హోమం, చండీ హోమం, మృత్యుంజయ హోమం, గణపతి హోమం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం, స్వామి అమ్మవార్ల కళ్యాణం, ఏకాంత సేవలను నిలుపుదల చేస్తున్నట్లు ఇఒ తెలిపారు.

చౌడేశ్వరి దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవస్థానం 2024 క్యాలెండర్‌ను, శ్రీ చౌడేశ్వరి దేవి మహా కుంభాభిషేకం మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ పిఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, ఆలయ ఈవో రామానుజన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చౌడేశ్వరి దేవస్థానం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి
www.prajasakti.com



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

సిపిఎం, సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం మండలం సున్నిపెంటలోని సిఐటియు కార్యాలయంలో 2024 సిఐటియు, సిపిఎం క్యాలెండర్‌ను పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం. చిన్న మారన్న బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే రానున్న 2024 ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏ. రాము, జెడ్డా నాగరాజు, వి.లక్ష్మయ్య, జాంగిర్ భాష, వి.రమేష్, చిన్న వెంకట చెన్నయ్య, ఎం. చంటి, సామ్ సోను, హరిబాబు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

సంక్రాంతి కానుకను వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, పట్టణ నాయకులు ఎ.సురేంద్ర, డి.రామ్ నాయక్, షైక్ ఇస్మాయిల్, జి.నాగేశ్వరావులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి, రంజాన్, క్రిస్టమస్, పండుగలకు చౌక డిపోల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేసేవారన్నారు. ఈ ప్రభుత్వం కూడా సంక్రాంతి కానుకగా బ్యాళ్లు, బెల్లం, గోధుమపిండి, పామాయిల్, పసుపు, కారం, చింతపండు, నెయ్యి తదితర నిత్యావసర సరుకులు ఈ నెలలో సంక్రాత్రి కానుకగా ఇవ్వాలని కోరారు. సాంప్రదాయాలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చే కానుకలు ఇవ్వాలన్నారు. ఒకవైపు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర సరుకుల ధరలతో పేద మధ్యతరగతి సామాన్య ప్రజానీకం తల్లడిల్లిపోతున్నారని చెప్పారు. ప్రభుత్వమే చౌక డిపోల ద్వారా సంక్రాంతి కానుక సరుకులు పంపిణీ చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

క్రీడలతో మెరుగైన ఆరోగ్యం : ఎంపిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

క్రీడల ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మహబూబ్‌దౌలా మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి 78 జట్లు మండలస్థాయికి చేరుకున్నాయన్నారు. ఈ పోటీల విజేతలు ఆళ్లగడ్డలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య, ఈఓ నాగమణి, సర్పంచులు తులసమ్మ, బాలీశ్వరరెడ్డి, వైస్ ఎంపిపి రఫి, వైద్యాధికారి ఇమ్రాన్, ఎంఈఓ న్యాంతుల్లా, పిడి దాదాపీర్, వివిధ పాఠశాలల పిఈటిలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** క్రీడల వల్ల స్నేహభావం పెంపొందుతుందని జెడ్పిటిసి శంకర్ రెడ్డి, ఎంపీడీవో మోహన్ కుమార్, తాసిల్దార్ ఉమారాణి లు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ పోటీలలో గెలిచినవారు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. **కొత్తపల్లి :** దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి సన్మార్గంలో నడపడం క్రీడలకే సాధ్యమని జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో మేరీ తెలిపారు. కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు మురళి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎర్రమఠం ఎంపీటీసీ ముబీనా బేగం, సర్పంచ్ విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుంకన్న, రీనా, స్వప్న, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, వైసిపి నాయకులు నారాయణరెడ్డి, నాగేశ్వర గౌడ్, పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, షహిన్ షా, చాందిని, స్రవంతి పాల్గొన్నారు. **రుద్రవరం :** యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా ఎంపీడీవో మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, జెడ్పిటిసి మాధవి, ఎంపీపీ మబ్బు బాలస్వామి మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఎస్సై నిరంజన్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పాణ్యం నాగేష్, దేవగుడి జాకీర్ హుస్సేన్, చిత్రేనిపల్లె మాధవ్ గౌడ్, గుండా నరసింహయ్య శెట్టి, కొల్లం పుల్లయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, సవరం నాగముని, ఎంఈఓ2 లక్ష్మి, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు. **పగిడ్యాల :** మండల స్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడ పోటీలు ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం ముఖ్యమంత్రి జగనన్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నా రన్నారు. గ్రామీణ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రమణ, తహశీల్దార్ భారతి, ఎంఈఓ లు సుభాన్, మురళి మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** వైయస్సార్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం-ఆంధ్ర పోటీల వల్ల మారుమూల గ్రామాల్లో ఉన్న విద్యార్థులు భవిష్యత్తు మారనున్నదని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అవుకు, కొండమ నాయన పల్లె గ్రామాల విద్యార్థులకు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తాసిల్దార్ ప్రసాద్ బాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



పగిడ్యాలలో పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



అవుకులో పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



తలకిందులైై ఉద్యోగుల నిరసన

తలకిందులుగా ఉండి ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాలలోని ధర్నా చౌక్‌లో 22వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా తలకిందులుగా ఉంటూ బుధవారం నిరసన తెలిపారు. అనకాపల్లికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ వాసుదేవరావు ఉద్యమంలో ఉంటూ, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చనిపోవడంతో నంద్యాల సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమ నాయకుడు కాంతారావు మాట్లాడుతూ ఉద్యోగులు ఎలాంటి ఆందోళనకు గురవద్దని, ఉద్యమంలో ఒత్తిడిలు సహజమని, ఇలాంటి వాటికి భయపడాల్సిన పని లేదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు పెంచి హెచ్.ఆర్ పాలసీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతుగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సెక్రటరీ బాల వెంకట్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు అన్ని విధాలుగా సహాయకారిగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, కార్యదర్శి నాగరాజు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు పాల్గొన్నారు.

సోలార్ పలకలు ధ్వంసం

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని జూనూతల గ్రామపంచాయతీ పరిధిలోని మజారా గ్రామం మారేమడుగులకు రైతు చిన్నపురెడ్డి పొలంలో ఉన్న సోలార్ పలకలను దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సోలార్ పలకల ద్వారా నీటిని తరలించి పంటలను సాగు చేసుకునే వాళ్ళమని, ఇప్పుడు సోలార్ పలకలను ధ్వంసం చేయటం వలన పంటలను ఎలా కాపాడుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

'ఆడుదాం-ఆంధ్రా' సంబరాలు సంతోషకరం

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం- ఆంధ్రా పేరిట క్రీడా సంబరాలు నిర్వహించడం సంతోషకరమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. బుధవారం డోన్ పట్టణంలో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్ నందు మండల స్థాయి కబడ్డీ పోటీలను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం క్రీడాకారులకు టోపీలను, టీ షర్టులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహశీల్దార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈఓ ప్రభాకర్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి రాజకుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, కౌన్సిలర్స్ మేకల విమల, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు వైయస్సార్ రఫీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెంపల్లి రామచంద్రుడు, వైసిపి నాయకులు మదన్, వ్యాయమ ఉపాధ్యాయులు, మునిసిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులకు టీషర్ట్ ను, టోపీలను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వైసిపితోనే సామాజిక సాధికారత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపితోనే సామాజిక సాధికారత సాధ్యమని, ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆళ్లగడ్డలో జరిగిన బహిరంగ సభలో అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పడం లేదని, వైసీపీ ఎమ్మెల్యేలను, మంత్రులను విమర్శించడం తప్ప ప్రజల కోసం వాగ్దానం చేసింది ఏమీ లేదన్నారు. బనగానపల్లెలో రవ్వలకొండ వద్ద తాము అక్రమ మైనింగ్ పాల్పడుతున్నట్లు చంద్రబాబు విమర్శించడం దారుణమన్నారు. నిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. టిడిపి పాలనలోనే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మోడల్ స్కూల్ పక్కన అక్రమంగా మైనింగ్ చేసినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, ఎంపీపీ మానసవీణ జడ్పిటిసి సుబ్బ లక్షమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, కొలిమిగుండ్ల మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, కోయిలకుంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగార్జున రెడ్డి, ఉప సర్పంచి జిసి సూర్యనారాయణ రెడ్డి, బనగానపల్లె మాజీ సర్పంచ్ ముర్తుజాబీ, వైసిపి నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అంబటి రవికుమార్ రెడ్డి, ఎవరెస్ట్ బాబు, కుమ్మరి సురేష్ బాబు, సైకిల్ షాప్ మహబుబ్ వలి, నీలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అనారోగ్యంతో టిడిపి నాయకుడు మృతి

- నివాళులర్పించిన బిసి ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని రాళ్ల కొత్తూరు తండాలో టిడిపి నాయకులు మూడవత్ రాజు నాయక్ (45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా గ్రామానికి వెళ్లి రాజు నాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజు నాయక్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు.



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు బొకే అందజేస్తున్న ఇరిగెల రాం పుల్లారెడ్డి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఇరిగెల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌ను బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో తాలూకా నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పవన్ కళ్యాణ్‌తో భేటీ అయ్యారు. రాయలసీమలో జనసేన పార్టీ అభివృద్ధి, ఉమ్మడి కర్నూలు జిల్లాలో పార్టీని ముందుకు తీసుకెళ్లడం, ఆళ్లగడ్డ తాలూకాలో పార్టీ పరిస్థితి, అభివృద్ధి, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం చేసే అంశాలను పవన్ కళ్యాణ్ దృష్టికి ఇరిగెల తీసుకెళ్లారు. అన్ని సానుకూలంగా పవన్ కళ్యాణ్ విని ఇరిగెలకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో జనసేన నాయకులు జున్ను ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరయిన రూ.11 లక్షల 43 వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే ఆర్థర్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

వైసిపి ప్రభుత్వంలోనే గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి - రుద్రవరం

వైసిపి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని గ్రామ సర్పంచి పాణ్యం లక్ష్మీదేవి, వైసిపి మండల కన్వీనర్ పాణ్యం నాగేష్ అన్నారు. మండలంలోని ఆలమూరు గ్రామంలో 30 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం పనులను బుధవారం వైసిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి సహకారంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి 20 లక్షల నిధులు 10 లక్షల ఉపాధి నిధులు మొత్తం 30 లక్షల నిధులతో గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాణ్యం చంద్ర, ఆలయ ధర్మకర్త శూలం ప్రభాకర్, మాజీ సర్పంచ్ జయరాముడు, బాలయ్య, రహీం, నజీర్, పత్తి బ్రహ్మయ్య, ఈశ్వరయ్య, డి భాషా, చెన్నయ్య, ఖాదర్ హుస్సేన్, అన్సర్ వలి తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చర్చల తేదీ ప్రకటించాలి

- ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎల్ఐసి యాజమాన్యం జాప్యం లేకుండా తక్షణం వేతన సవరణ చర్చల తేదీ ప్రకటించాలని ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్ సెక్రటరీ ఏ.రమేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కార్యక్రమాన్ని, నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలలో జరగాల్సిన చర్చలను అర్ధాంతరంగా యాజమాన్యం వాయిదా వేసిందన్నారు. ఎల్ఐసిలో వేతన సవరణ గడువు ముగిసి ఒకటిన్నర సంవత్సరమైందని, ఇంకా చర్చలు ప్రారంభం కాకపోవడం అన్యాయమన్నారు. 2022 డిసెంబర్‌తో పోలీస్తే 2023 డిసెంబర్‌లో 94 శాతం అధికంగా ప్రీమియం ఎల్ఐసి సేకరించిందన్నారు. గత రెండు దశాబ్దాలుగా జీవిత బీమా రంగంలో ప్రైవేటు కంపెనీల గట్టి పోటీని ఎదుర్కొని ఎల్ఐసిని ప్రపంచ స్థాయి సంస్థగా నిలబెట్టిన ఘనత సిబ్బందిదేనని అన్నారు. నూతన పెన్షన్ స్కీం వర్తించే సిబ్బందికి 14 శాతం యాజమాన్య పిఎఫ్ వాటా చెల్లించాలన్నారు. ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలన్నారు. సిబ్బంది అంశాలలో ఇటీవల యాజమాన్యం ప్రదర్శిస్తున్న ఏకపక్ష వైఖరిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సమ్మె కార్యక్రమంలో నాయకులు డి.హరిప్రియ, బి.గురవయ్య, పాండురంగయ్య, జెవి.రమణ, డి.దేవా, వెంకటరాముడు, రవిశంకర్ శుక్ల తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

భిక్షాటన చేస్తూ మున్సిపల్ కార్మికులు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలో మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా 16వ రోజు బుధవారం భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, భాస్కరా చార్యులు నాయకత్వం వహించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కెఎండి గౌస్ పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. **ఆత్మకూరు :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, జీతాలు పెంచాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు జోసెఫ్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు 16వ రోజు సమ్మెలో భాగంగా ర్యాలీగా వెళ్లి కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మున్సిపల్ కార్మికులు తిమయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి భిక్షాటన చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ, రూరల్ కార్యదర్శి సి.నాగన్న, మున్సిపల్ కార్మికులు పరమేష్, నాగేశ్వరరావు, భాస్కర్, నాగన్న పాల్గొన్నారు.



కమిషనర్‌ను భిక్షం అడుగుతున్న మున్సిపల్ కార్మికులు

షోకాజ్ నోటీసులపై ఆగ్రహం

5వ పేజీ తరువాయి.. వర్కర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె శిబిరం వద్ద షోకాజ్ నోటీసులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిఐటియు మండల నాయకులు బి వెంకట శివుడు, అంగన్వాడీ నాయకులు లక్ష్మి కుమారి, శోభమ్మ, శైలజ, జయమ్మ, రాధిక, శారద, ఉమాదేవి, పద్మావతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** అంగన్వాడీల ఇండ్లకు నోటీసులు అంటించడంతో మహానంది తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు ఆధ్వర్యంలో జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డిని నిలువరించి నిరసన తెలిపారు. జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డిమాండ్లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామన్నారు. తహశీల్దార్ జనార్దన్ శెట్టి మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచన మేరకే నోటీసులు అంటించినట్లు తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు సావిత్రి, నారాయణమ్మ, జ్యోతి, ఉషారాణి, గౌరీ, చండీ దేవిలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ సమ్మె శిబిరం వద్ద షోకాజ్ నోటీసులను తిరస్కరించారు. సిఐటియు జిల్లా నాయకులు సుధాకర్, దావీదు, అంగన్వాడీ నాయకులు పద్మావతి, శ్రీదేవి, లీలావతి, ప్రభావతి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అంగన్వాడి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంకే నాగలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు ఆఫీసు నుండి ర్యాలీగా పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గల అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, అంగన్వాడీలు సుబ్బలక్ష్మి, వరలక్ష్మి, అంజలీదేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జేవీ సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, సభ్యులు రమాదేవి, వరలక్ష్మి, మల్లేశ్వరి, మహేశ్వరి, శశికళ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు :** వెలుగోడులో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ముగ్గులు వేస్తూ నిరసన తెలిపారు. సమ్మెకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ రాజశేఖర్, నాయకులు యాదాటి నాగేంద్రుడు, సిఐటియు నాయకులు మహమ్మద్ రఫీలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్, అంగన్వాడి సెక్టార్ నాయకురాలు భాగ్యలక్ష్మి, రవణమ్మ, తులసమ్మ, కుమారి, అనిత మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **చాగలమర్రి :** అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెను అణచివేయాలని చూస్తే సహించేది లేదని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సిఐటియు, ఏఐటీయూసీ సంఘాల నాయకురాలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ సర్కిల్లో అంగన్వాడీలు 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. నాయకురాలు సంజీవమ్మ, రామ సుబ్బమ్మ, నాగమణి, చంద్రకళ, హసీనా, ఇందుమతి, సుజాత, హసానమ్మ, గుర్రమ్మ, మేరీ, జ్యోతి పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బండి ఆత్మకూరులో పర్యటించిన నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిలను అంగన్వాడి కార్యకర్తలు అడ్డుకొని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆనందమ్మ, వెంకట రమణమ్మ, వసంత, శ్యామల పాల్గొన్నారు. **పాములపాడు :** అంగన్వాడిల సమ్మెకు జనసేన నాయకులు జనసేన రాము పూర్తి మద్దతు తెపి మాట్లాడారు. జనసైనికులు పవన్, గోపీనాథ్, లోకన్నా, పి.సూర్య బాబు, కుమార్, చరణ్, మహేష్, సిపిఎం నాయకులు స్వామన్న,టి.వెంకటేశ్వరరావు, మేకల రాజు, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కలబండి.అంకన్న, భారత్ వికలాంగుల పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం శ్రీనివాసులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం తాసిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. అంగన్వాడి నాయకురాళ్లు మనోజ, పద్మావతి, బీబీ, లలిత మ్మ, రాఘవేంద్రమ్మ, రాజేశ్వరి, తిరుపాలమ్మ తదితరులు మాట్లాడారు. మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలందరూ పాల్గొన్నారు.



నంద్యాలలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



ఆత్మకూరులో ఉరితాళ్లతో అంగన్‌వాడీల నిరసన



బండిఆత్మకూరులో ఎంపీ, ఎమ్మెల్యేను అడ్డుకున్న అంగన్‌వాడీలు



వెలుగోడులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, నాయకులు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, నంద్యాల వారి కోర్టులో

O.S. No.460/2022

కుంచె రామేశ్వరమ్మ .... వాది

వర్సెస్-

బత్తుల శివప్రసాద్ రెడ్డి, 42సం॥లు, తండి-శివరామిరెడ్డి,హిందువు, వ్యాపారం, మినరల్ వాటర్ ప్లాంట్, గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, సాయిబాబానగర్ ఆర్చి దగ్గర, నంద్యాల టౌన్ నంద్యాల జిల్లా.

.... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్ ప్రకటన

పై నంబర్ దావా యందు వాది అయిన కుంచె రామేశ్వరమ్మ గారి పేర ప్రతివాది వ్రాయించి యిచ్చిన ప్రామిసరి నోటు మొత్తము వడ్డీతో కలిపి రాగోరి ప్రతివాది పైన దావా దాఖలు చేసియుంటున్నది. సదరు దావాలో ప్రతివాదియైన నీకు సమన్లు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేసినందు వల్లను, అందు నిమిత్తం ప్రతివాదివైన నీ పైన పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు జారీ చేయుటకు ఇచ్చిన కోర్టు ఉత్తర్వు మేరకు ప్రతివాదివైన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని 5-2-2024 వ తేదీ ఉదయం 10-30గం॥లకు హాజరై నీ ఆక్షేపణలను తెలుపుకొనవలసినది. లేనంతట పై కోర్టు వారు నీ పరోక్షమందు దావాను పరిష్కరించుదురని యిందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా 5-2-2024

బి. హరిప్రసాద్
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, నంద్యాల వారి కోర్టులో

O.S. No.192/2020

దూదేకుల రహిమాన్ .... వాది

వర్సెస్-

దూదేకుల నరేష్ బాష 39 స॥లు, తండ్రి డి. పక్కీరయ్య, దూదేకుల, వ్యాపారం, ఇ.నెం 26-607-7-930, వి.సి. కాలనీ, నంద్యాల టౌన్ &, నంద్యాల జిల్లా,

...............ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్ ప్రకటన

పై నంబర్ దావా యందు వాది అయిన దూదేకుల రహిమాన్ గారి పేర ప్రతివాది వ్రాయించి యిచ్చిన ప్రామిసరి నోటు మొత్తము వడ్డీతో కలిపి రాగోరి ప్రతివాది పైన దావా దాఖలు చేసియుంటున్నది. సదరు దావాలో ప్రతివాదియైన నీకు సమన్లు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేసినందు వల్లను, అందు నిమిత్తం ప్రతివాదివైన నీ పైన పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు జారీ చేయుటకు ఇచ్చిన కోర్టు ఉత్తర్వు మేరకు ప్రతివాదివైన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని 31-1-2024వ తేదీ ఉదయం 10-30గం॥లకు హాజరై నీ ఆక్షేపణలను తెలుపుకొనవలసినది. లేనంతట పై కోర్టు వారు నీ పరోక్షమందు దావాను పరిష్కరించుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా 31-1-2024

బి.హరిప్రసాద్
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల